నొందెను. అటుపైన తనకు కలిగిన అన్యాయమును విశదపఱుచుకొనఁగా అందులకు మదరాసు గవర్నమెంటువారు సమ్మతించి ఇదివఱకు చేసిన రెండుభాగములను రద్దుపఱిచి మూడుభాగములు చేయుటకు అనేకప్రయత్నములు చేసిరి గాని తుదకు కొనసాగలేదు. అప్పుడు ఉభయులతో చెప్పి బలాత్కారముమీఁద అలవెన్సు ఇప్పించిరి. నిడుదవోలు ఎస్టేటులోనుండి తంగెళ్లమూడి ఎస్టేటును నూజవీడు ఎస్టేటులోనుండి చేవెంద్రముతాలూకాను ఇచ్చివేయఁబడెను. నరసింహాప్పారావుగారి పెద్దకుమారుఁడగు సింహాద్రి అప్పారావుగారికి తంగెళ్లమూడి ఎస్టేటు వచ్చియుండెను. వారికి పుత్రసంతతి లేనందున వారియనంతరము వారి దౌహిత్రు లగు వేంకటగిరిమహారాజుగారి పెద్ద కుమారునికి సంక్రమించుటచే వారు ప్రస్తుతము అనుభవించుచున్నారు. మూడవ కుమారు లగు వేంకటాద్రిఅప్పారావుగారికి చేవెంద్ర రావి వెళ్ల వచ్చియుండెను. వారి కుమారులే శ్రీ రాజా పార్థసారధి అప్పారావుగారై యున్నారు. వీరు స్వప్రయోజకత్వముచేత మాతామహుల యాస్తి యగు పోలవరంచ భద్రాచలము ఎస్టేట్లను సంపాదించుటయే కాక నిడుదవోలు ఎస్టేటులో మూడవ భాగమునకు వ్యాజ్యెము తెచ్చి ప్రీవీకవున్సిలులోఁ గడచిన జూలై నెలలో డిక్రీని పొందియున్నారు. వీరి పెద్దకుమారులు శ్రీ రాజా నారయ్యప్పారావుగారు. రెండవ కుమారు లగు శ్రీ వేంకటరామయ్య అప్పారావుగారు కొద్దిమాసముల క్రిందట పరలోకగతు లైనారు. పెద్దకుమారు లగు శ్రీ రాజా నారయ్యప్పారావుగారికి ముగ్గురు పుత్రులు గలరు.

శనివారపుపేటలో పెద్దన్నగారగు శ్రీ రాజా వేంకటనరసింహా అప్పారావు బహద్దరుగారు 1827-వ సం॥ జూను 5వ తేదీని కాలధర్మము నొందిరి. వారికి పుత్రులు లేనందున చిన్నతమ్ము లగు నరసింహాప్పారావుగారి ద్వితీయపుత్రు లగు నారయ్యప్పారావుగారిని *దత్తుచేసికొనిరి. వారికిని పుత్రులు లేనందున తన భార్య లగు శ్రీ చిన్నమ్మారావు, పాపమ్మారావు గార్లకు పుత్రస్వీకారమునకు అనుజ్ఞ యిచ్చి 1864-వ సం.న పరలోకగతు లైరి. చిన్నమ్మారావుగారు కాలముచేసిన తరువాత పాపమ్మారావుగారు ప్రథమములో నూజవీడు భాగస్థులలో నొకరైన మేడూరు జమీందారగు వేంకటరామయ్యప్పారావుగారినిని, వారి యనంతరము వారి పైనరు కుమారునిన్ని దత్తుచేసికొనిరి. ఆ పిల్లవాఁడును వారి జీవితకాలములోనే కాలముచేసినందున, పాపమ్మారావుగారి యనంతరము వారసు లగు శ్రీ రాజా పార్థసారధి అప్పారావుగారికిని, నూజవీడు సంస్థానములోని ఉయ్యూరు ఎస్టేటు జమీందారు లగు శ్రీ రాజా రంగయ్యప్పారావు బహద్దరుగారికిని, మీర్జాపురము జమీందారు లగు శ్రీ రాజా వేంకటనరసింహాప్పారావు బహద్దరుగారికిని సమానభాగములు వచ్చియున్నవి.

నూజవీడులో ప్రభుత్వము చేయుచున్న రామచంద్రప్పారావుగారు 1814-వ సంవత్సరములో పరలోకగతు లైరి. వారి కుమారు



లగు శ్రీ రాజా శోభనాద్రి అప్పారావు బహద్దరుగారు అప్పటికి ఐదు సంవత్సరముల వయస్సు గలవారగుటచేత వారి మైనారిటీ వెళ్లువఱకు ఎస్టేటును కోర్టుఆఫ్ వార్డ్సువారు పాలించిరి. వారు 1831-వ సంవత్సరమున ఎస్టేటు స్వాధీనపఱుచుకొని త్యాగభోగశీలు లై ప్రజారంజకముగ ప్రభుత్వము చేసి 1868-వ సంవత్సరము అక్టోబరు 18-వ తేదీని పరలోకగతు లైరి. వీరు భీమడోలు ముఠా గ్రామములను కొనిరి. వీరికి ఏడుగురు కుమారులు.—

1. శ్రీ రాజా నారయ్యప్పారావు బహద్దరుగారు. వీరు 1868-వ సం. మొదలు బహుదర్పముగ పరిపాలనచేసిరి. ఎస్టేటును పరిపాలన చేయుటలో మిక్కిలి సమర్థులని ప్రఖ్యాతి పొందిరి. వీరు ప్రభుత్వము చేయుచుండఁగనే వీరి తమ్ములు ఎస్టేటును భాగింపవలసినదిగా వ్యాజ్యెము తెచ్చిరి. కాని వారు జీవించియుండునంతవఱకును జిల్లా, హైకోర్టులలో భాగమునకు అర్హత లేదని తీర్పు కాఁబడెను. వీరి కాలములోనే రాజధాని యగు నూజవీడుపురమును బాగుపఱిచినారు. రోడ్లు వేయించి, చెఱువులు త్రవ్వించి, పట్టణపు వైఖరికి తెచ్చినారు. అగిరిపల్లి పర్వతముమీఁద వేంచేసియుండు కుటుంబముయొక్క యిష్టదైవమగు శ్రీ శోభనాచలపతిస్వామివారి దేవాలయము సోపానములు గట్టించిరి. వీరు 1877-వ సం. జూలై 19-వ తేదీని కాలముచేసిరి. తదనంతరము ప్రీవీ కవున్సిలువారు ఎస్టేటు భాగార్హమని తీర్పుచేసిరి.

* వీరు అప్పుడు మైనరు అగుటచే 1835-వ సంవత్సరమువఱకు ఎస్టేటు కోర్టాఫ్ వార్డ్సు పరిపాలనలో నుండెను. ఋణము అధిక మగుటచేతను, గవర్నమెంటు పన్ను చెల్లింపక పోవుటచేతను, గుండుగొలను పెరటపాడు పరగణాలు 1843-వ సం. లో వేలము వేయఁబడెను. 1851-వ సంవత్సరమందు పన్నుబాకీనిమిత్తము వేలము వేసి గవర్నమెంటువారే కొనిరి. తిరిగి కనికరించి 1860-వ సంవత్సరమున జమీందారున కొసంగిరి.